క్లుప్తంగా

'భవన నిర్మాణాలకు ఇసుక ఉచితంగా ఇవ్వాలి'

వనపర్తి రూరల్: జిల్లాలో భవన నిర్మాణాలకు ఇసుక ఉచితంగా ఇవ్వడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంధం మదన్, కార్యదర్శి బొబ్బిలినిక్సన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో ఆరు నెలలుగా ఆన్‌లైన్ పని చేయకపోవడంతో జిల్లాల్లో ఇప్పటి వరకు 450 బీమాలు రెన్యూవల్ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పట్టణంలో అడ్డాల్లో ఉంటున్న కూలీలకు షెడ్లు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, కురుమయ్య, పుల్లయ్య, గట్టయ్య, రాములు, కురుమూర్తి, నాగన్న, భాస్కర్, రవి, నరసింహ, ఎల్లస్వామి, రాములు, నరేందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



వనపర్తి రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 10 చెక్కులను మండలంలోని పెద్దగూడెంలో కాంగ్రెస్ నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందజేశారు.

ఈదమ్మ ఉత్సవాలు



వీపనగండ్ల: మండలంలోని తూంకుంటలో ఈదమ్మ జాతరను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి యేటా ఈదమ్మ దేవతకు బోనాలతో పాటు షిడే ఉత్సవాలు చేస్తారు. వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా స్థానిక ఎస్‌ఐ రాణి ఆలయ పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

రామకృష్ణ పరమహంసకు ఘన నివాళి



ఆత్మకూర్: రామకృష్ణ పరమహంస జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం వివేకానంద విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, దివాన్జీ ప్రభాకర్‌రావు, తాల్లపల్లి నాగరాజు, వెంకటనర్సింహారావు, మణివర్ధన్ రెడ్డి, నాగేశ్వర్, నర్సింహ, బాలకృష్ణ, బాలు, రాజేష్, సూరి, రాము, వెంకటేష్ ఉన్నారు.

సామూహిక అన్నప్రాసన

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీడీపీఓ లక్ష్మమ్మ, సూపర్‌వైజర్ సబిత మాట్లాడుతూ ఆరు నెలల వయస్సు లోపు చిన్నారులకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, 6 నెలల వయసు దాటిన వారికి అదనపు ఆహారం, అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, కిషోర బాలికలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత సమస్యను అధిగమించొచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, ప్రమీల, చిన్నారుల తల్లులు ఉన్నారు.

వీధి కుక్కల బెడద




పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో కొన్ని రోజులుగా వీధి కుక్కల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తూ గేదెలు, గొర్రెలు, కోళ్లపై దాడులు చేస్తూ చంపేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. పశువులతో పాటు చిన్న పిల్లలపై దాడులు చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. వీధి కుక్కల బెడదను నివారించాలని గ్రామసభల్లో తీర్మానం చేసి అధికారులకు పంపించినా స్పందన లేదని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం తీవ్రంగా జరగక ముందే గ్రామంలో వీధి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదిలోనే అవాంతరాలు..!

పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సర్వేకు అడ్డంకులు

- జిల్లాలో వేధిస్తున్న సర్వేయర్ల కొరత
- మరోవైపు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- 15 రోజుల్లో సర్వే కష్టమేనంటున్న అధికారులు



ఊట్కూర్ మండలంలోని బాపూర్‌లో భూ సర్వే చేస్తున్న సర్వేయర్ల బృందం

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ ప్రక్రియకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఓవైపు భూములు కోల్పోతున్న రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండగా.. మరోవైపు సర్వేయర్ల కొరత వేధిస్తోంది. ఫలితంగా భూ సర్వే ప్రక్రియ సాఫీగా సాగక ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్లు తలలు పట్టుకుంటున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్, ఆర్డీఓ రాంచందర్ నాయక్ పర్యవేక్షణలో ఈ నెల 15 నుంచి భూసేకరణ సర్వే కొనసాగుతోంది. అయితే పక్షం రోజుల్లో సర్వేను పూర్తిచేయాలని అధికారులు సర్వేయర్ల బృందంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న 9మంది సర్వేయర్లతో 15 రోజుల్లో సర్వేను పూర్తి చేయడం కష్టతరమని వారు బహిరంగంగా చెబుతున్నారు. పక్కా జిల్లాల నుంచి మరి కొంత మంది సర్వేయర్లను కేటాయిస్తే నిర్ణీత గడువులోగా సర్వే చేసేందుకు వీలవుతుందని ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వేయర్ల కొరతను తీర్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పినట్లు సర్వేయర్లు చెబుతున్నారు.

373.18 ఎకరాల సర్వే..

నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం స్టేజ్–1 భూత్పూర్ నుంచి ఊట్కూర్ ట్యాంక్, స్టేజ్–2 ఊట్కూర్ ట్యాంక్ నుంచి జయమ్మ ట్యాంక్ వరకు, స్టేజ్–3 జయమ్మ ట్యాంక్ నుంచి కానుకుర్తి ట్యాంక్ వరకు చేపట్టనున్నారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే చేయాలని ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్, ఆర్డీఓ రాంచందర్ నాయక్ సూచిస్తూ ఈ నెల 13న ప్రొసీడింగ్‌ను సర్వే ఏడీకి పంపించారు. మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లి నుంచి కానుకుర్తి వరకు దాదాపు 373.18 ఎకరాలకు సంబంధించి భూ సర్వే చేపట్టాలని ప్రొసీడింగ్‌లో పేర్కొన్నారు.

పొంతన లేని లెక్కలు..

వాస్తవానికి ఇరిగేషన్ అధికారులు డీజీపీఎస్ సర్వే నిమిత్తం మార్కింగ్ ఇస్తున్నారు. ఈ మేరకు సర్వేయర్లు జీపీఎస్ పరికరంతో కొలతలు చేస్తున్నారు. అయితే ఇరిగేషన్ శాఖ అధికారుల లెక్కలకు, సర్వేయర్ల లెక్కలకు పొంతన లేకుండా పోతోంది. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న సర్వేయర్లలో ఎవరికి సరిగా సబ్ డివిజన్ పని రాదని జిల్లా ఆధికారే అంటున్నారని ఇరిగేషన్ అధికారులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. వాస్తవానికి జీపీఎస్‌తో సర్వే చేస్తే సుమారు 3 నుంచి 5 మీటర్ల వరకు తేడా వస్తుందని.. విషయాన్ని జిల్లా సర్వే అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొంటున్నారు. కాగా, సర్వే చేయడానికి ఆర్డర్స్ ఇచ్చి 15 రోజులు గడిచినా కేవలం 180 ఎకరాల సర్వే మాత్రమే జరిగింది. ఇప్పటి వరకు సబ్ డివిజన్ రికార్డు సమర్పించలేదంటే సర్వేయర్ల బృందం పనితీరును అర్థం చేసుకోవచ్చు. కలెక్టర్ సర్వే శాఖపై పూర్తిస్థాయి దృష్టి సారిస్తే తప్ప భూసేకరణలో ముందడుగు పడే అవకాశం కనిపించడం లేదు.

రైతులు సహకరించాలి..



నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కావాల్సిన భూమి సేకరణకు రైతులు సహకరించాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుంది. భూసేకరణ ప్రక్రియ త్వరగా జరిగితే ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతాయి. ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందుతుంది.

– రాంచందర్‌నాయక్, ఆర్డీఓ, నారాయణపేట

మండలాల వారీగా భూ సర్వే ఇలా..

- మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లిలో 68.30 ఎకరాలు, ఎర్లాన్‌పల్లిలో 5.25, మంతన్‌గోడ్‌లో 10.30, టేకులపల్లిలో 2.11, కాచ్వార్‌లో 14.25 ఎకరాల సర్వే చేపట్టాలని నిర్ణయించారు.
- ఊట్కూర్ మండలంలోని వెడివెల్లిలో 24.09, పులిమామిడిలో 1.02, పెద్దపొర్లలో 15.25, జీర్నల్లిలో 9.27, దంతన్‌పల్లిలో 58.02, బాపూర్‌లో 70.28, తిప్రాస్‌పల్లిలో 3.36 ఎకరాలు.
- నారాయణపేట మండలంలోని జాజాపూర్‌లో 9.33, సింగారంలో 10.17, కొరంపల్లిలో 11.20, పేరపళ్లలో 13.03 ఎకరాలు.
- దామరగిద్ద మండలంలోని బాపన్‌పల్లిలో 11.33, దామరగిద్దలో 5.07, లింగారెడ్డిపల్లిలో 16.20, గడిమున్కన్‌పల్లిలో 10.05 ఎకరాల సర్వే చేపట్టాలని ప్రొసీడింగ్‌లో పేర్కొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ..



సర్వేను అడ్డుకుంటున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు (ఫైల్)

మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో చేపట్టిన భూ సర్వేపై రైతులు అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ అధికార బృందాన్ని అడ్డుకుంటున్నారు. ఊట్కూర్ మండలంలోని బాపూర్, దామరగిద్ద మండలంలోని వత్తుగుండ్ల తండా, మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి రైతులు భూ సర్వేపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు నడుమ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. రైతులు భూ నష్టపరిహారం చెల్లింపు విషయంలో నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేను కలిసి విన్నవించాలని.. సర్వే పనులను అడ్డుకోవద్దంటూ పోలీసులు సూచిస్తున్నారు.

'సమయం వృథా చేయొద్దు'



ఖిల్లాఘనపురంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న ఎంఈఓ

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈఓ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సన్నద్ధతపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో పదో తరగతి పునాదిలాంటిదన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధమైతే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం ప్రముఖ రచయిత, సైకాలజిస్ట్ యండమూరి వీరేంద్రనాథ్ రచించిన టాప్ ర్యాంక్ నూరు సూత్రలు పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శివయ్య పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థులు ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హరిజన్‌వాడ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్‌గా శైలజ, డీఈఓగా దామోదర్, ఎంఈఓ శ్రావణి, హెచ్‌ఎంగా అరవింద్ బాధ్యతలు నిర్వహించగా మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమానికి ఎంఈఓతో పాటు బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాళిదాస్ అతిథులుగా హాజరయ్యారు. అభివృద్ధి నిధుల నుంచి తీసుకొచ్చిన చెస్ బోర్డు, లుడో గేమ్, క్యారం, బాల్స్ తదితర క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాధవి, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, ఐఈఆర్పీ రజిత పాల్గొన్నారు.



చిక్కేపల్లి పాఠశాలలో..

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి

పాన్‌గల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పాన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌డీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలను బడి మాన్పించి పనులు చేయించిన, చిన్న వయస్సులో పెళ్లిలు చేస్తే బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ క్రైం, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ల గురించి వివరించారు. ఆయా అంశాలపై విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం సొసైటీ సభ్యులు, అధ్యాపక బృందంతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్‌డీఎస్ మండల ఇన్‌చార్జ్ రాజశేఖర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మధుమేహ పరీక్షలు



కేతేపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు కొనసాగుతున్నాయని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. 30 ఏళ్లు నిండిన వారందరూ పరీక్షలు చేయించుకొని వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామాల్లో పర్యటించి పరీక్షల వివరాలను సిబ్బందితో ఆరా తీశారు. షుగర్ పరీక్షలు చేయించుకోవడంతో వ్యాధి నిర్ధారణ అయితే ఆహారపు అలవాట్లను మార్చుకొని తగిన జాగ్రత్తలు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. నిత్యం, నడక, యోగా చేస్తూ వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో సిబ్బంది 1,056 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

కాపలాదారులపై దాడి: వరాహాల అపహరణ



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఆత్మకూర్: పట్టణంలోని పరమేశ్వరస్వామి చెరువు వద్ద పందులకు కాపలాగా ఉన్న వ్యక్తులపై దాడి చేసి పందులు అపహరించిన ఘటన చోటుచేసుకుందని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. చెరువు కట్ట బ్రిడ్జి కింద పందులను సంరక్షించే కొట్టం వద్ద నిద్రిస్తున్న కాపలాదారులు చెన్నయ్య, పరశురాములుపై సోమవారం రాత్రి రెండు గంటల సమయంలో నలుగురు వ్యక్తులు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. అనంతరం నంబర్‌ప్లేటు లేని బొలెరో వాహనంలో 30 పందులను ఎత్తుకెళ్లారని, దాడిలో చెన్నయ్య, పరశురాములు గాయపడ్డారని వివరించారు. మంగళవారం బాధితుల ఫిర్యాదు మేరకు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి పరిశీలించి విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై అందించే వ్యవసాయ యాంత్రీకరణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రాజవర్ధన్ రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ యొక్క ప్రాముఖ్యత, సబ్సిడీలు, సాగు ఖర్చు, కూలీల కొరతను తగ్గించడానికి, సమయాన్ని ఆదా చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. దీంతో పాటు వ్యవసాయ అభివృద్ధి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడానికి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తాయని శాస్త్రవేత్తలు వివరించారు. సమావేశంలో ఏఈఓలు అఖిల, నరేష్, షర్మిల, శైలజ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలోని వడ్డెరవాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈఓ భాస్కర్‌శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం

గోపాల్‌పేట: ఓ వ్యక్తి అమ్మాయిని తీసుకువెళ్లగా తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ అమ్మాయిని అదే గ్రామానికి చెందిన మడ్డి దశరథం అనే వ్యక్తి సుమారు రెండు నెలల క్రితం తనతో పాటు తీసుకువెళ్లాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల ఇళ్లలో వెతికినా.. ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

అంబులెన్స్ కేటాయింపుపై హర్షం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 108 వాహనాన్ని సమకూర్చాలని మండలంలోని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు విజ్ఞప్తి చేయడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం హెల్త్ సెంటర్‌కు అంబులెన్స్‌ను కేటాయించారు. సమస్య వివరించిన వెంటనే స్పందించిన మంత్రి అంబులెన్స్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా ఉమ్మడి మండలంలోని 40 గ్రామాలకు వైద్య సౌకర్యం అందుతుందని ప్రజలు తెలిపారు.

పాన్‌గల్ కస్తూర్బాను సందర్శించిన డీఆర్డీఓ

పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం రాత్రి డీఆర్డీఓ ఉమాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టాక్ రూమ్‌లోని సరుకులు, భోజనం నాణ్యత పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందిస్తున్నారా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. వంట చేసే గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలకు సిద్ధం చేయాలని ఎస్‌ఓకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, ఎస్‌ఓ హేమలత తదితరులు ఉన్నారు.



క్రీడలతో ఉజ్వల భవిష్యత్



కొత్తకోట: క్రీడల్లో ప్రతిభ చూపిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీడీసీ మాజీ చైర్మన్ బీసం చెన్నకేశవ రెడ్డి అన్నారు. పట్టణంలో ఐదో రోజు జరుగుతున్న క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని, పోరాటతత్వం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, గుంత శివ, రఘు, కార్తీక్, సాయి, సన్నీ, మహేష్, శివశంకర్, తరుణ్, గణేష్, అరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉదిత్‌రాజ్‌పై కఠినచర్యలు తీసుకోవాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

గోపాల్‌పేట: జాతీయ బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతిపై కాంగ్రెస్ పార్టీ నేత ఉదిత్‌రాజ్ సోమవారం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మిద్దె మహేష్ అన్నారు. మంగళవారం ఆయన బీఎస్పీ నాయకులతో కలిసి రేవల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ నేత మీడియా సాక్షిగా మహాభారతాన్ని ప్రస్తావిస్తూ శ్రీకృష్ణుడు మాయావతిని చంపమని ఆదేశించాడని మాట్లాడిన మాటలు సామాజిక విభజనకు దారి తీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాటలు మాయావతిపై వ్యక్తిగత దూషణ మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకు, సామాజిక సమానత్వానికి ముప్పు కలిగించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మధు, దేవేందర్, హుస్సేన్, రవితేజ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

ఖిల్లాఘనపురం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉమ్మడి పాలమూరు జిల్లా ఆదివాసి కాంగ్రెస్ కమిటీ చైర్మన్ లింగంనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను హెచ్‌ఎం లామ్‌లాల్‌నాయక్, పలువురు నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వలన సిలబస్ పూర్తి కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో విషసర్పాలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయన్నారు. డార్మెంటరీలో సరైన ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో దోమల బెడద ఎక్కువై విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఆశ్రమ పాఠశాలను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గద్వాల జిల్లా ఆదివాసి కమిటీ చైర్మన్ ముడావత్ శివనాయక్, కో ఆర్డినేటర్ రామచంద్రుడు నాయక్, జిల్లా కోఆర్డినేటర్ దేవుడునాయక్, హర్యనాయక్, నారాయణ నాయక్, మన్యనాయక్, భిక్షనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

గోపాల్‌పేట: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ మార్చేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురైన ఘటన మండలంలోని చాకల్‌పల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చాకల్‌పల్లికి చెందిన కొండారెడ్డి తన పొలంలో వరి సాగుచేశాడు. మంగళవారం వారికి కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చూడగా.. ఫ్యూజ్ కాలిపోయి కనిపించింది. ఫ్యూజ్ మార్చేందుకు ఏబీ స్విచ్ బంద్ చేసుకుని ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. అనుకోకుండా కరెంటు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో కొండారెడ్డి చేతికి, వీపులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. షాక్ కొట్టిన వెంటనే సబ్‌స్టేషన్‌లో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ప్రాణాపాయం తప్పిందని లేదంటే ప్రాణనష్టం జరిగేదని గ్రామస్తులు తెలిపారు.

మార్మోగిన శివనామస్మరణ



వనపర్తి రూరల్: రాజపేట అమ్మవారి ఆలయంలో మంగళవారం శివ మాలధారులు మహా పడిపూజ నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద మహా పడిపూజ, ఇరుముడి మహోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా శివ మాలధారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు, భజనలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు శివకుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.